# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com









హైదరాబాద్ | బుధవారం 5-5-2021 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 228 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# ఈటెలపై గులాబీ బాస్ గరం గరం..!

హైదరాబాద్ , మే 4:మాజీ మంత్రి ఈటెల వ్యవహారంపై సీఎం కేసీఆర్ సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్ పార్టీపై, తనపైన ఎదురుదాడి చేయడంతో పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపైన సీనియర్ నేతలతో కేసీఆర్ మంతనాలు జరిపిన ట్లు సమాచారం. ఈటెల వ్యవహారం పై టీఆర్ఎస్ పార్టీ క్రమశిక్షణ సంఘం దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది. పార్టీ పరంగా ఈటెలపైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

కాగా, మెదక్ జిల్లాలోని మూసాయిపేటలో రైతుల భూములను ఈటెల కబ్జా చేశారన్న నేపథ్యంలో మంత్రి పదవి నుంచి ఈటెలను తొలిగిస్తూ కేసీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. మంత్రి పదవి తొలిగింపు అనంతరం నిన్న మీడియాతో మాట్లాడిన ఈటెల టీఆర్ఎస్ పైన, కేసీఆర్ పైన సంచలన వ్యాఖ్యలు చేశారు. కారు గుర్తు మీద గెలిచామని మీరంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమేనని ప్రకటించారు. తన రాజకీయ జీవితం తెరిచినా పుస్తకమని, 19ఏళ్ల రాజకీయ జీవితంలో అవినీతిరహిత నాయకుడిగా పేరు సంపాదించుకున్నానని తెలిపారు. ఉద్యమ సమయంలో ప్రలోభ పెట్టిన లొంగలేదని, పార్టీకి, ప్రభుత్వానికి ఏనాడూ మచ్చ తెచ్చే ప్రయత్నం చేయలేదని చెప్పారు. ప్రస్తుతం కేబినెట్ లో ఉన్న ఏ ఒక్క మంత్రి కూడా ఆత్మగౌరవంతో ఉన్నామని చెప్పుకోలేరని వ్యాఖ్యానించారు. ఈటల వ్యాఖ్యలపై సీఎం కేసీఆర్ సీరియస్ అయ్యారు. ఆయన పైన పార్టీ పరంగా చర్యలు తీసుకునేందుకు రెడీ అయినట్లు తెలుస్తోంది.

ఇప్పటికే మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, పార్టీ సీనియర్ నేత బోయినపల్లి వినోద్ ఈటలకు కౌంటర్ ఇచ్చారు. ఈటల రాజేందర్ ఒక మేకవన్నె పులి, బలహీన వర్గాల ముసుగులో ఉన్న పెద్ద దొర అంటూ మంత్రి గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు. ఈటలను అన్ని విధాల కేసీఆర్ గౌరవించి ప్రాధాన్యత ఇచ్చారని మంత్రి కొప్పుల ఈశ్వర్ గుర్తు చేశారు. అసెంబ్లీలో ఫ్లోర్ లీడర్ సహా కీలక మంత్రిత్వశాఖలు ఇచ్చారని తెలిపారు.

## శ్రీ జగ్ మోహన్ కన్నుమూత పట్ల సంతాపం తెలిపిన ప్రధాన మంత్రి

హైదరాబాద్ , మే 4:శ్రీ జగ్ మోహన్ కన్నుమూత పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేశారు."జగ్ మోహన్ గారి మరణం మన దేశానికి భర్తీ చేయలేనటువంటి లోటు. ఆయన మార్గదర్శకుడైన పరిపాలకుడూ, ప్రసిద్ధ పండితుడూను. ఆయన భారతదేశం అభివృద్ధి కోసం ఎల్లప్పటికీ కృషి చేసిన మనిషి. ఆయన మంత్రి పదవి ని నిర్వర్తించిన కాలం వినూత్న మైన విధానాల కు రూపకల్పన చేసిన కాలం గా నిలచిపోతుంది. ఆయన కుటుంబానికి, ఆయన ను అభిమానించే వారికి ఇదే నా సంతాపం. ఓమ్ శాంతి." అని ఒక ట్వీట్ లో ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

# తెలంగాణలో కొత్తగా 6876 కరోనా పాజిటివ్స్ - 59 డెత్స్..

హైదరాబాద్ , మే 4:రాష్ట్రంలో కరోనా టెస్టింగ్ కిట్ల కొరత రోజు రోజుకు తీవ్రమ వుతోంది. కరోనా సెకండ్‌వేవ్ ప్రమాదకరస్థితిలో వ్యాపిస్తున్న సమయంలోనూ కరోనా టెస్టులను 70వేలకే పరిమితమ య్యాయి. వాస్తవానికి వైరస్ ఉధృతి రాష్ట్రంలో తీవ్రంగా ఉంది. ఈసమయంలో టెస్టులు ఎక్కువ చేసి పాజిటివ్ కేసులను వేరు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. అయితే? కిట్లకు భారీగా కొరత ఏర్పడడంతో టెస్టుల సంఖ్య తగ్గించారు. ఫలితంగా పాజిటివ్ కేసులు కాస్త తగ్గుముఖం పట్టాయి. గడిచిన 24 గంటల్లో 70.961 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 6876 మందికి పాజిటివ్ నిర్ధారణైంది. . తాజా కేసులను కలుపుకుంటే రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన కరోనా కేసుల సంఖ్య 4, 63, 761కు చేరుకుంది. కరోనా నుంచి కోలుకోవడంతో 7432 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 3, 81, 365 మంది కరోనా నుంచి కోలుకున్నారు. కాగా? ఇక కరోనాతో సోమవారం నాడు 59 మంది మృత్యువాత పడ్డారు. ఈ సంఖ్యను కలుపుకుంటే ఇప్పటి వరకు రాష్ట్రంలో 2476 మంది కరోనాతో మృత్యువాత పడ్డారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కరోనా కేసులు పెద్ద సంఖ్యలో నమోదవు తున్నాయి. ఆదిలాబాద్‌లో 112, భద్రాద్రి కొత్తగూడెం 121, జీహెచ్ఎంసీ 1029, జగిత్యాల 211, జనగామ 65, జయశంకర్ భూపాలపల్లి 78, జోగులాంబ గద్వాల 96, కామారెడ్డి 118, కరీంనగర్ 264, ఖమ్మం 235, కొమరంభీం ఆసీఫాబాద్ 84, మహబూబ్‌నగర్ 229, మహబూబాబాద్ 133, మంచిర్యాల 188, మెదక్ 30, మేడ్చల్ మల్కాజిగిరి 502, ములుగు 44, నాగర్‌కర్నూల్ 190, నల్గొండ 402,నారాయణపేట 29. నిర్మల్ 58, నిజామాబాద్ 218, పెద్దపల్లి 218, రాజన్నసిరిసిల్ల 107, రంగారెడ్డి 387, సంగారెడ్డి 157, సిద్దిపేట 258, సూర్యాపేట 372, వికారాబాద్ 171, వనపర్తి 123, వరంగల్ రూరల్ 109, వరంగల్ అర్బన్ 354, యాదాద్రి భువనగిరి 183.

కోవిడ్ వార్డుల్లో సదుపాయాల కొరత? బెడ్లకు కటకట

కోవిడ్ రోగుల తాకిడి పెరిగిపోతుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆసుపత్రుల్లో ముఖ్యంగా హైదరాబాద్ లోని గాంధీ, టిమ్స్, కింగ్‌కోఠి తదితర ఆసుపత్రుల్లో సదుపాయాల కొరత పెరిగిపోతోంది. ప్రభుత్వ ప్రయివేటు ఆసుపత్రుల్లో కోవిడ్ బెడ్లకు తీవ్ర కొరత ఏర్పడింది. చికిత్స పొందుతున్న కరోనా పేషెంట్ డిశ్చార్జ్ అయితేనే, లేకపోతే చనిపోతే మాత్రమే మరో కోవిడ్ రోగికి పడక దొరికే పరిస్థితి ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొంది. బెడ్ దొరక్కపోవడంతో ఆసుపత్రుల ప్రాంగణంలోని చెట్ల కింద రోగులు ఉండాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఎప్పుడు పడక ఖాళీ అవుతుందా..? అని వైద్యులను, సిబ్బందిని నిమిషనిమిషానికి వేడుకుంటున్నారు. ఆక్సిజన్ నిల్వలు పడిపోయిన స్థితిలోనే కోవిడ్ రోగులను ఆసుపత్రులకు వస్తున్నారు. దీంతో వారు కోలుకునేందుకు కనీసం వారం,పది రోజుల సమయం పడుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వైద్యం దొరుకుతుందన్న కొండంత ఆశతో హైదరాబాద్ గాంధీ, కింగ్ కోఠి, చెస్ట్ ఆసుపత్రులకు వస్తే? ఆక్సిజన్, వెంటిలేటర్, ఐసీయూ బెడ్లు నిండా యన్న సమాధానం వస్తోంది. దీంతో రోగుల తరఫున బెడ్ కోసం రోగులు, వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రుల ప్రాంగణాల్లోనే నిరీక్షించాల్సి వస్తోంది. చివరకు ఒకే ఆక్సిమీటర్‌ను ఐసీయూ, ఆక్సిజన్ వార్డుల్లోని కోవిడ్ పేషెంట్ల కోసం వినియోగించాల్సి వస్తోంది. టీబీ, ఈసీజీ మిషన్లు కూడా పెద్ద సంఖ్యలో చేరుతున్న రోగులకు సరిపడా లేని పరిస్థితి నెలకొంది.

# టీఆర్ఎస్ పార్టీ విచ్ఛిన్నానికి ఈటల ప్రయత్నం : మంత్రి కొప్పుల

హైదరాబాద్ , మే 4:హైదరాబాద్ : ప్రభుత్వంపై, సీఎం కేసీఆర్‌పై ఈటల రాజేందర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదు. ఈటల రాజేందర్ విమర్శల్లో వాస్తవం లేదు. టీఆర్ఎస్‌లో తనకు గౌరవం లేదని ఈటల రాజేందర్ చెప్పడం సత్యదూరం. ఈటల గౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం జరగలేదు. టీఆర్ఎస్‌ను విచ్ఛిన్నం చేసే విధంగా పలుసార్లు ఈటల మాట్లాడారు అని మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు.

టీఆర్ఎస్ పార్టీ ఏర్పడిన తర్వాత 2003లో ఈటల రాజేందర్ పార్టీలో చేరారు. పార్టీలో ఈటల చేరకముందే ఉద్యమం ఉధృతంగా ఉందన్నారు. ఉద్యమ కాలంలోనూ ఈటలను కేసీఆర్ అన్ని విధాలా గౌరవించి ప్రాధాన్యత ఇచ్చారు అని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి మంత్రివర్గంలోనే ఈటలకు చోటు దక్కిందన్నారు. టీఆర్ఎస్ పార్టీ ఆయనకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. ఈటల రాజేందర్‌కు ఏం తక్కువైందో తమకు అర్థం కావడం లేదన్నారు. ఈటల రాజేందర్‌కు సీఎం కేసీఆర్ అన్ని రకాల పదవులు, అవకాశాలు ఇచ్చారు. టీఆర్ఎస్ఎల్పీ నేతగా, ఆర్థిక, పౌరసరఫరాలు, వైద్య శాఖ మంత్రిగా ఈటలకు అవకాశం ఇచ్చారు. పథకాలపైన కూడా మాట్లాడి విమర్శించడం చాలా బాధాకరం. ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించడం సరికాదు.

పేదలకు, దళితులకు ప్రభుత్వం కేటాయించిన భూమిని కొనకూడదని ఈటలకు తెలియదా? అని ప్రశ్నించారు. 66 ఎకరాల అసైన్డ్ భూమిని కొన్నానని ఈటలనే స్వయంగా చెప్పారు. అసైన్డ్ భూములను వ్యాపార విస్తరణ కోసం కొనుగోలు చేసినట్లు ఈటలే చెప్పారు అని గుర్తు చేశారు. ఈటలకు వ్యాపారమే ముఖ్యం.. బీసీలు, ఎస్సీల స్థితిగతులు పట్టవు అని చెప్పారు. ఎకరం కోటిన్నర పలికే భూమిని రూ. 6 లక్షలకే కొనుగోలు చేశారు. విలువైన భూములను తక్కువ ధరకు ఎందుకు కొనుగోలు చేశారు. దేవరయాంజల్‌లో దేవాలయ భూములను కూడా కొనుగోలు చేశారు. దేవాలయ భూములని తెలిసి కూడా ఎందుకు కొనుగోలు చేశారు? అని ప్రశ్నించారు. పార్టీ ద్వారా అనేక రకాలుగా ఈటల లబ్ధి పొందారు. మీకు ఏదో అన్యాయం జరిగిందని సీఎంపై దాడి చేయడం తగదు అని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు.

# అధికారులంతా అంకితభావంతో పనిచేయాలి : సీఎస్

హైదరాబాద్ , మే 4:కొవిడ్ పరిస్థితులను అధిగమించేందుకు అధికారులంతా అంకితభావంతో పనిచేయాలని సీఎస్ సోమేశ్ కుమార్ సూచించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు, సీనియర్ ఐఏఎస్ అధికారులు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో బీఆర్‌కే భవన్‌లో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

మున్సిపల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో కూడిన బృందాలను ప్రతి ఇంటికి పంపించాలని, జ్వరం, ఇతర లక్షణాలతో బాధపడుతున్నవారిని గుర్తించి మెడికల్ కిట్లను అందజేయాలని ఆదేశించారు.

అన్ని వీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు, ఇతర ఆరోగ్య కేంద్రాలలో కొవిడ్ అవుట్ పేషెంట్ క్లీనిక్‌లను నిర్వహించాలన్నారు.

నిమ్స్ ఆసుపత్రి, సరోజిని దేవి, ఛాతీ, గాంధీ, ఫివర్, టిమ్స్, కింగ్ కోఠి, మలక్ పేట, గోల్కొండ, వనస్థలిపురం, కొండపూర్ ప్రభుత్వ దవాఖానల్లో కొవిడ్ పడకల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు.

అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానల్లో పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలన్నారు.

సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి రిజ్వీ, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కమిషనర్, డైరెక్టర్ ఎన్ సత్యనారాయణ, ఆర్థికశాఖ స్పెషల్ సెక్రటరీ రోనాల్డ్ రాస్, ఇంటర్మీడియెట్ విద్యా కార్యదర్శి ఒమర్ జలీల్, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి కేఎస్ శ్రీనివాస రాజు, టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ నరసింహా రెడ్డి పాల్గొన్నారు.

# హైదరాబాద్ లో మరోసారి భారీ వర్షం..



హైదరాబాద్ , మే 4:హైదరాబాద్ లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి పొడిగా, ఎండగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం వరకు మారిపోయింది. మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురిసింది.

దీంతో రోడ్లన్నీ జలమయం కావడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కల్గుతుంది. వర్షం కురిసే ముందు ఈదురుగాలులు వీయడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అటు తెలుగు రాష్ట్రాల్లోనూ పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఏపీలో మరో మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురవనున్నట్లు తెలిపింది వాతావరణ శాఖ.

# యూపీలో బీజేపీ కౌంట్‌డౌన్ ప్రారంభం !

లక్నో, మే 4:: గత నెలలో జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలతో అధికార యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ వారణాసి, అయోధ్యలో విజయాన్ని సాధించగా.. మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ, అజిత్ సింగ్ ఆర్ఎల్‌డీ మధురలో అగ్రస్థానంలో నిలిచాయి. కాషాయ పార్టీకి ముఖ్యమైన ఈ మూడు జిల్లాల్లో ప్రత్యర్థులు విజయ పతాక ఎగురవేశారు. నాలుగేళ్ల పదవీకాలంలో యోగి ఈ మూడు జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించిన పెద్దగా ప్రయోజనం లేకపోయింది. పంచాయతీ ఎన్నికల ఫలితాలు బీజేపీకి రానున్న కాలంలో గట్టి ఎదురుదెబ్బే అని తేలింది.

శాసన మండలి ఎన్నిక అనంతరం వారణాసిలో బీజేపీ ఇప్పుడూ పంచాయతీ ఎన్నికలలో కూడా ఓడిపోయింది. ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంటరీ నియోజకవర్గంలో కాషాయ పార్టీ జిల్లా పంచాయతీలోని 40 స్థానాల్లో కేవలం 8 స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగింది. సమాజవాదీ పార్టీ 14 సీట్లు, బీఎస్పీకి 5 సీట్లు, అప్నాదళ్ (ఎస్) మూడు సీట్లు సాధించాయి. ఆమ్ ఆద్మీ పార్టీ సైతం వారణాసిలో తన ఖాతాను తెరిచింది.

మధురలో కూడా బీజేపీ ఘోరమైన ఓటమిని ఎదుర్కొంది. మధురలో బీఎస్పీ 12 సీట్లు, చౌదరి అజిత్ సింగ్ రాష్ట్రీయ లోక్‌దళ్ 9 సీట్లు గెలుచుకోగా బీజేపీ 8 స్థానాల్లో గెలుపొందింది. ఎస్పీ ఒక స్థానంలో గెలుపొంది ఖాతాను తెరిచింది. స్వతంత్రులు ముగ్గురు గెలిచారు. అయోధ్యలో సైతం బీజేపీ పరిస్థితి ఏమంత బాగాలేదు. జిల్లాలోని 40 స్థానాల్లో 24 స్థానాలను ఎస్పీ కైవసం చేసుకుంది. బీజేపీ కేవలం 6 సీట్లను మాత్రమే గెలుచుకుంది. మిగిలినవి స్వతంత్రులు స్వాధీనం చేసుకున్నారు.

బీజేపీ రాజకీయ ఎజెండాలో అయోధ్య, మధుర, కాశీ ఈ మూడు జిల్లాలు కేంద్రంగా ఉన్నాయి. అయితే 8 నెలల తరువాత జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు పంచాయతీ ఎన్నికల ఫలితాలు యోగి ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బే అని చెప్పొచ్చంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

# నేను సీఎం కావాలని ఎప్పుడూ అనుకోలేదు : ఈటల

హైదరాబాద్ , మే 4:ఒక బాధ్యత కలిగిన మంత్రిపై కక్ష్యపూరితంగా వ్యవహరించి అవమానించటం దేశంలో ఇదే మొదటిసారి అని మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. 2014 వరకే కేసీఆర్? ధర్మాన్ని, ప్రజలను నమ్ముకున్నారని అన్నారు. తెలంగాణ గాంధీగా పేరుగాంచిన గొప్ప వ్యక్తి.. ఇవాళ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎవరివో తప్పుడు సలహాలు, నివేదిక వల్ల తనపై కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. తన వ్యవహారం నచ్చకపోతే పిలిపించి అడిగితే తానే రాజీనామా చేసేవాడినని ఈటల తెలిపారు. తాను ముఖ్యమంత్రి కావాలని ఎప్పుడూ అనుకోలేదని ఈటల రాజేందర్ వెల్లడించారు. కేసీఆర్ తర్వాత ఆయన కుమారుడు కేటీఆరే సీఎం కావాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.

తాను అన్ని పార్టీల నాయకులతో మాట్లాడతానని తెలిపిన ఈటల? కాంగ్రెస్, బీజేపీ నేతలతో మాట్లాడితే నేరమనే భావన టీఆర్ఎస్ లోనే ఉందన్నారు. తనపై మంత్రులు చేస్తున్న విమర్శలపై స్పందించిన ఈటల? తన గురించి తెలిసి కూడా ఆరోపణలు చేయటం ఎంతవరకు సమంజసమో వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు తెలిపారు. ధర్మాన్ని, న్యాయాన్ని ఎవరూ చెరపలేరన్న ఈటల? ప్రభుత్వాధికారుల బాధ్యతారాహిత్యాన్ని హైకోర్టు నిలదీసినట్లు తెలిపారు. ప్రభుత్వం కర్కశత్వం చూపుతున్నప్పుడు? రాజ్యాంగాన్ని న్యాయస్థానాలు కాపాడతాయనడానికి ఈ సంఘటనే ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గాల నుంచి పేద ప్రజలను కాపాడుతున్నందుకు న్యాయస్థానాలకు ఈటల కృతజ్ఞతలు తెలిపారు.

# జమున హ్యాచరీస్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

హైదరాబాద్ , మే 4:అసైన్డ్ భూముల వివాదం వ్యవహారంలో జమున హ్యాచరీస్ ప్రైవేటు లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోంది. పిటీషనర్ తరపు వాదనలను లాయర్ దేశాయ్ ప్రకాష్ రెడ్డి వినిపిస్తున్నారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రెవెన్యూ, విజిలెన్స్ విచారణ చేపడుతున్నారని పిటీషనర్ పేర్కొన్నారు. తమ అనుమతి లేకుండా తమ భూముల్లోకి వెళ్లి విచారణ చేపడుతున్నారని తెలిపారు. కలెక్టర్ నివేదిక తప్పులతడకగా ఉందని, తమకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విచారణ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని జమున హ్యాచరీస్ పిటిషన్‌లో కోరింది.

66 ఎకరాలు ఆసైన్డ్ భూమి అక్రమాలకు పాల్పడినట్లు కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని పిటీషనర్ తరుపు న్యాయవాది ప్రకాశ్ రెడ్డి అన్నారు. పట్టా భూములను కొనుగోలు చేసి జమున హ్యాచరిస్ కంపెనీ పెట్టారని తెలిపారు. ధరణి పోర్టల్ లో కూడా అవి పట్ట భూములని ఉందని చెప్పారు. సాధారణంగా ఏదైనా విచారణ జరిగితే కొన్ని రోజుల పాటు జరుగుతుందని, కానీ ఇక్కడ అత్యనీత వేగంగా 24 గంటల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. నివేదికలో కలెక్టర్ ఈటెల జమునా లి/నీ నితిన్ అని రాసిన అంశాన్ని కోర్టు దృష్టికి పిటిషనర్ తరుపు న్యాయవాది తెచ్చారు. నివేదిక వేగంగా పూర్తి చేయాలని అత్రుతలో కనీసం జాగ్రతలు తీసుకోకుండా ఇష్టానుసారంగా బంధాలు మార్చేశారని ప్రకాశ్ రెడ్డి ఆరోపించారు.కాగా, జమున హ్యాచరీస్ భూ వివాదాలకు సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్ దర్యాప్తునకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఒకదాని వెంట మరొకటిగా వేగంగా జరుగుతున్న పరిణామాలు ఈ విషయం స్పష్టం చేస్తున్నాయి. ఇక మెదక్ జిల్లా అసైన్డ్ భూముల వ్యవహారంలో ఇప్పటికే మంత్రివర్గం నుంచి ఈటలను తొలగించగా, తాజాగా దేవరయాంజాల్ భూముల వ్యవహారంపైనా నలుగురు ఐఏఎస్‌లతో కూడిన కమిటీ విచారణ, విజిలెన్స్ దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో మెదక్ జిల్లా అసైన్డ్ భూముల వ్యవహారంలో ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందింది. ఏసీబీ, ఇంటిలిజెన్స్ ఇతర విభాగాలు రంగంలోకి దిగి ముమ్మర విచారణ కొనసాగిస్తున్నాయి.

# బెంగాల్లో హింసాకాండ పై దీని స్పందన.. ప్రశాంతంగా ఉండాలని పిలుపు

న్యూఢిల్లీ, మే 4: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఆ రాష్ట్రంలో పెద్ద ఎత్తున హింసాకాండ చోటుచేసుకుంది. ఈ ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ, రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు బాధాకరమని చెప్పారు. హింసాత్మక ఘటనల్లో ఎవరూ పాలుపంచుకోవద్దని చెప్పారు. ఎక్కడైనా గొడవ జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. శాంతిభద్రతలను పోలీసులు కాపాడాలని ఆదేశించారు. అందరూ ప్రశాంతంగా ఉండాలని కోరారు. శాంతిని ప్రేమించే రాష్ట్రం బెంగాల్ అని అన్నారు. ఎన్నికల సమయంలో కొన్నిచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. బీజేపీ ఎంతో టార్చర్ చేసిందని మండిపడ్డారు.మరోవైపు మమత వ్యాఖ్యలపై రాష్ట్ర బీజేపీ చీఫ్ దిలీప్ ఘోష్ స్పందిస్తూ? అందరూ ప్రశాంతంగా ఉండాలని మమత కోరడం మంచి పరిణామమని అన్నారు. రాష్ట్రంలో హింస చల్లారకపోతే తాము ధర్నాలు, నిరసన కార్యక్రమాలను చేపట్టాల్సి వస్తుందని చెప్పారు. విజయం సాధించిన తర్వాత కూడా టీఎంసీ హింసకు పాల్పడటం దారుణమని అన్నారు. ఎందరో ప్రాణాలు కోల్పోయారని దాదాపు వెయ్యి గృహాలు, కార్యాలయాలు ధ్వంసమయ్యాయని మండిపడ్డారు.




# బయోమార్కర్లు, స్టెరాయిడ్లపై ఎయిమ్స్ చీఫ్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 4: : కరోనావైరస్ బారినపడి స్వల్ప లక్షణాలతో బాధపడే వారికి సీటీ స్కాన్ అవసరం లేదన్న ఎయిమ్స్ చీఫ్ డాక్టర్ రణ్ దీప్ గులేరియ తాజాగా బయో మార్కర్లు, స్టెరాయిడ్స్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. బయోమార్కర్లను గుర్తించేందుకు నిర్వహించే సీఆర్పీ, డీ-డైమర్ వంటి పరీక్షలను కరోనా వైరస్ సోకి తీవ్ర, మధ్యస్థ లక్షణాలతో బాధపడేవారు చేయించుకోవాలని స్పష్టం చేశారు. ఆక్సిజన్ సాధారణంగా ఉన్నవారు, లక్షణాలు లేనివారికి ఈ రక్త పరీక్షలు అవసరం లేదని చెప్పారు.దంతాల్లో ఇన్ఫెక్షన్ ఉన్నా ఈ పరీక్షలో ఇన్ఫెక్షన్ తీవ్రతను చూపుతాయని, అవసరం లేకుండా బయోమార్కర్లపై ఆధారపడి చికిత్స అందిస్తే అవి శరీరంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యుల సూచనతోనే బయోమార్కర్లను నిర్వహించాలన్నారు.

# బెంగాల్ హింసపై ప్రధాని ఆందోళన.. గవర్నర్‌కు ఫోన్

న్యూఢిల్లీ, మే 4:: పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత జరిగిన హింసపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ ఆ రాష్ట్ర గవర్నర్ జగ్‌దీప్ ధన్‌కర్‌కు ఫోన్ చేశారు. ఈ విషయాన్ని గవర్నరే ట్విటర్ ద్వారా వెల్లడించారు. రాష్ట్రంలో దిగజారుతున్న శాంతి భద్రతలపై ప్రధాని తీవ్ర ఆవేదన, ఆందోళన వ్యక్తం చేసినట్లు గవర్నర్ జగ్‌దీప్ ఆ ట్వీట్‌లో తెలిపారు. ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో తృణమూల్ కాంగ్రెస్ గెలిచిన తర్వాత బెంగాల్‌లో హింస చెలరేగింది.

ఈ హింసలో మొత్తం 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ హింసపై స్పందించిన మోదీ మంగళవారం గవర్నర్‌కు ఫోన్ చేసి పరిస్థితులపై ఆరా తీశారు. ఆ తర్వాత గవర్నర్ జగ్‌దీప్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో హింస, విధ్వంసం, లూటీ, దహనాలు, హత్యలు నిరంతరాయంగా కొనసాగుతుండటంపై గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఈ హింసలో ప్రాణాలు కోల్పోయిన బీజేపీ కార్యకర్తల కుటుంబాలను కలవడానికి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా.. రెండు రోజుల పాటు బెంగాల్‌లో పర్యటించే అవకాశం ఉంది.యితే ప్రధాని ఈ స్టంట్లు ఆపి ముందు ఇండియాలో కొవిడ్ పరిస్థితులపై దృష్టి సారించాలని టీఎంసీ ఎంపీ డెరిక్ ఓబ్రైన్ ట్వీట్ చేశారు. అందులో ఢిల్లీలో ల్యాండైన 300 టన్నుల కొవిడ్ ఎమర్జెన్సీ సరఫరాలు ఏమయ్యాయి అన్న ఓ న్యూస్ రిపోర్ట్‌ను పోస్ట్ చేశారు. కొవిడ్ పరిస్థితులు లేదా దీనిపై ముందు దృష్టి సారించండి అని ప్రధానికి సూచించారు.

# లాక్ డౌన్ ఒక్కటే మార్గం.. 'న్యాయ్'తో రక్షణ: రాహుల్

న్యూఢిల్లీ, మే 4: దేశంలో కరోనా సెకండ్ వేవ్ విజృంభిస్తోంది. ప్రతిరోజు కేసులు లక్షల్లో నమోదు అవుతున్నాయి. మృతుల సంఖ్య కూడా ప్రతిరోజు మూడు వేలపైనే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కరోనా వైరస్ వ్యాప్తిని నిలువరించడానికి సంపూర్ణ లాక్ డౌన్ మాత్రమే ఏకైక పరిష్కారమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు ట్విట్టర్‌లో ఆరోపణలు గుప్పించారు."ప్రస్తుత పరిస్థితుల్లో కరోనాను నియంత్రించాలంటే పూర్తిస్థాయి లాక్ డౌన్ ఒక్కటే పరిష్కారం. లాక్ డౌన్ వల్ల నష్టపోయే వర్గాలకు 'న్యాయ్' ద్వారా రక్షణ కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం ఇంత వరకూ ఏం చేయలేదు. వారి అలసత్వంతోనే చాలా మంది ప్రజల ప్రాణాలు పోతున్నాయి" అని రాహుల్ ట్వీట్ చేశారు.కాగా, న్యాయ్(కనీస ఆదాయ పథకం) పథకాన్ని కాంగ్రెస్ పార్టీ 2019 పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద దేశంలోని నిరుపేద కుటుంబాలకు ఏడాదికి రూ.72,000 అందజేస్తామని కాంగ్రెస్ అప్పట్లో తెలిపింది. 'న్యాయ్'గా వ్యవహరించే ఈ పథకం కింద దేశంలోని 20 శాతం నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని రాహుల్ పేర్కొన్నారు.

# భారత నావికాదళం చేపడుతున్న కోవిడ్ సంబంధిత కార్యక్రమాలను సమీక్షించిన - ప్రధానమంత్రి

హైదరాబాద్ , మే 4:కోవిడ్ మహమ్మారి సమయంలో దేశ ప్రజలకు సహాయం చేయడానికి భారత నావికాదళం తీసుకుంటున్న వివిధ కార్యక్రమాల గురించి ఆయన ప్రధానమంత్రి కి వివరించారు. భారత నావికాదళం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కలిసి, ఆసుపత్రుల్లో పడకలు, రవాణా, టీకాలు వేసే కార్యక్రమం అమలు వంటి విషయాల్లో, తగిన సహాయం అందిస్తున్నట్లు, ఆయన, ప్రధానమంత్రికి తెలియజేశారు. వివిధ నగరాల్లోని పౌరుల ఉపయోగం కోసం, వివిధ నావికాదళ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా పడకలు కేటాయించినట్లు, ఆయన ప్రధానమంత్రి కి వివరించారు.

కోవిడ్ విధులను నిర్వహించడానికి నావికాదళం లోని వైద్య సిబ్బందిని, దేశంలోని వివిధ ఆసుపత్రులలో తిరిగి నియమించినట్లు ఆయన ప్రధానమంత్రికి తెలియజేశారు. కోవిడ్ ఆసుపత్రులలో మోహరించిన వైద్య సిబ్బందిని పెంచడానికి నావికాదళానికి చెందిన సిబ్బందికి యుద్ధ క్షేత్రంలో అనుసరించే వైద్య సంరక్షణపై శిక్షణ ఇస్తున్నారు.

ఆక్సిజన్ లభ్యతను పెంచడంతో పాటు, లక్షద్వీప్, అండమాన్, నికోబార్ దీవులలో కోవిడ్ సంబంధిత సామాగ్రిని తిరిగి నింపడానికి భారత నావికాదళం సహాయం చేస్తోందని, నావికాదళ అధిపతి, అడ్మిరల్ కరంబీర్ సింగ్, ప్రధానమంత్రి కి వివరించారు.

భారత నావికాదళం, బహ్రెయిన్, ఖతార్, కువైట్, సింగపూర్ నుండి భారతదేశానికి, ఆక్సిజన్ కంటైనర్లతో పాటు, ఇతర సామాగ్రిని రవాణా చేస్తోందని ఆయన ప్రధానమంత్రికి తెలియజేశారు.

# యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ

హైదరాబాద్ , మే 4:యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న, అంటే సోమవారం నాడు, టెలిఫోన్ ద్వారా మాట్లాడారు.

భారతదేశం లో, యూరోపియన్ యూనియన్ (ఇయు) లో ప్రస్తుతం నెలకొన్న కోవిడ్-19 స్థితి తో పాటు, కోవిడ్-19 తాలూకు రెండో వేవ్ ను అదుపు లోకి తీసుకు రావడం కోసం భారతదేశం చేస్తున్న ప్రయత్నాల ను గురించి నేత లు ఇరువురు ఒకరి ఆలోచనల ను మరొకరికి తెలియజెప్పుకొన్నారు. కోవిడ్-19 తాలూకు రెండో వేవ్ కు వ్యతిరేకం గా భారతదేశం చేస్తున్న యుద్ధానికి తక్షణ మద్దతు ను కూడగట్టినందుకు ఇయు ను, ఇయు సభ్యత్వ దేశాల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు.

జులై లో జరిగిన కడపటి శిఖర సమ్మేళనం జరిగిన తరువాత నుంచి భారతదేశం-ఇయు వ్యూహాత్మక భాగస్వామ్యం ఒక సరి కొత్త వేగ గతి ని అందుకొందని వారు గుర్తించారు. ఈ నెల 8 న వర్చువల్ పద్ధతి లో జరుగనున్న ఇండియా-ఇయు నేత ల సమావేశం ఇప్పటికే బహు ముఖాలుగా విస్తరించినటువంటి ఇండియా-ఇయు సంబంధాల కు ఒక సరి కొత్త జోరు ను అందించేందుకు లభించిన ఒక ముఖ్యమైన అవకాశమే అంటూ నేతలిద్దరూ వారి సమ్మతి ని వ్యక్తం చేశారు.

ఇండియా-ఇయు నేత ల సమావేశం ఇయు+27 నమూనా లో జరిగే ఒకటో సమావేశం కానుంది. అంతేకాదు, ఇండియా-ఇయు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత గా బలపరచుకోవాలంటూ ఇరు పక్షాలు వ్యక్తపరుస్తున్న ఆకాంక్ష ను ఇది ప్రతిబింబిస్తోంది.

# 45 ఏళ్ల పైబడిన వాళ్లకే వ్యాక్సిన్..

## -ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటేనే

## నేరుగా వెళితే టీకా దొరకదు

హైదరాబాద్ , మే 4: రాష్ట్రంలో 45ఏళ్లు దాటిన వారికి మాత్రమే కరోనా టీకా అందనుంది. మే 1 నుంచి 18ఏళ్లు నిండిన వారందరికీ కరోనా టీకా వేస్తామని కేంద్రం ప్రకటించినా? వ్యాక్సిన్లకు కొరత కారణంగా ఆ ప్రకటన కార్యరూపం దాల్చడం లేదు. ఇక రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో మరో 5695 మందికి కరోనా మహమ్మారి సోకింది. కరోనాతో ఒక్క రోజే 46 మంది మృత్యువాతపడ్డారు. అయితే రోజు వారీ కరోనా టెస్టులు లక్షా 20వేల నుంచి 50వేలకు తగ్గడంతోనే పాజిటివ్ కేసుల్లో తగ్గుదల కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. పాజిటివ్ కేసులు తగ్గుతున్నప్పటికీ ఆసుపత్రులకు కోవిడ్ రోగులు పోటె త్తుతూనే ఉన్నారు. దీంతో ఆసుపత్రుల్లో సదుపా యాల కొరత ఏర్పడుతోంది. కోవిడ్ బెడ్ కోసం రోజుల తరబడి రోగులు, వారం బంధువులు ఆసుపత్రుల ప్రాంగణాల్లోని చెట్ల కిందే నిరీక్షించాల్సిన దయనీయ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. 45ఏళ్లు పైబడిన వారు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటేనే టీకా వేస్తా మని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ డా. జీ. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు తేల్చి చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి టీకాలు వేయ టం లేదని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రభుత్వ కేంద్రాల్లోనే కరోనా వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు వివరించారు. ఒక్కో కేంద్రంలో రోజుకు 200 మందికి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మిగతా చోట్ల ఒక్కో కేంద్రంలో 100 మందికి వ్యాక్సిన్ ఇస్తామన్నారు. ప్రభుత్వ వ్యాక్సినేషన్ సెంటర్లలో మొదటి, రెండోడోస్ వేస్తామన్నారు. వ్యాక్సిన్ వేయించుకునే తేదీ, దగ్గర్లోని ఆరోగ్య కేంద్రం వివరాలు నమోదు చేయాలన్నారు. నేరుగా వ్యాక్సిన్ సెంటర్లకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా వ్యాక్సినేషన్ పొందే అవకాశం ఉండదన్నారు. మొదటి డోస్ తీసుకున్న తర్వాత 6 వారాలు పూర్త?నా? రెండో డోస్ తీసుకోవచ్చన్నారు. కోవిషీల్డ్ మొదటి డోస్ తీసుకున్న ఆరు నుంచి 8 వారాల తర్వాత కూడా రెండో డోస్ తీసుకోవచ్చని తెలిపారు. కోవాగ్జిన్ మొదటి డోస్ తీసుకుంటే 4 నుంచి 6 వారాల తర్వాత రెండో డోస్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండో డోస్‌కు నాలుగైదు రోజులు అటు ఇటు అయినా ఫరవాలేదన్నారు. అయితే రెండు డోస్‌ల కరోనా టీకా తీసుకుంటేనే వైరస్ నుంచి పూర్తి రక్షణ లభిస్తుందని స్పష్టం చేశారు.

# హైదరాబాద్ జూపార్కు సింహాలకు కరోనా లక్షణాలు



హైదరాబాద్ , మే 4: కరోనా సెకండ్ వేవ్‌లో జంతువులకు కరోనా సోకుతున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఇటీవలే గుజరాత్ గిర్ సంరక్షణ కేంద్రంలోని సింహాలకు కరోనా పాజిటివ్ వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో మనుషుల నుంచి జంతువులకు కరోనా వ్యాప్తిపై పరిశోధనలు ముమ్మరమయ్యాయి. తాజాగా హైదరాబాద్ నెహ్రూ జూపార్క్‌లోని 8 సింహాలకు కోవిడ్ లక్షణాలు కనిపించాయి. ఆ 8 సింహాల శాంపిల్స్‌ను జూ అధికారులు సీసీఎంబీ పరీక్షల నిమిత్తం పంపించారు. మంగళవారం రిపోర్ట్స్ వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే జూపార్క్‌లోకి సందర్శకుల ప్రవేశాలు నిలిపివేశారు.

# ఆసియా అభివృద్ధి బ్యాంకు వార్షిక సమావేశం 2021 లో భాగంగా గవర్నర్ల సదస్సులో పాల్గొన్న ఆర్థిక మంత్రి శ్రీ మతి నిర్మలా సీతారామన్

హైదరాబాద్ , మే 4:కేంద్ర ఆర్థిక , కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి, ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎడిబి) ఇండియా గవర్నర్ నిర్మలా సీతారామన్ ఈరోజు ఉజ్వల భవిష్యత్‌కు సహకారానికి సంబంధించిన సదస్సులో పాల్గొన్నారు.ఎడిబి వార్షిక సమావేశం 2021లో భాగంగా ఈ సదస్సు జరిగింది. ఈ సదస్సులో జపాన్, జార్జియా, చైనా, ఫిలిప్పీన్స్, నెదర్లాండ్స్ పాల్గొన్నాయి. వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో ఎడిబికి చెందిన 68 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోవిడ్ -19 మహమ్మారిపై అకుంఠితదీక్షతో పోరాటం చేస్తున్నభారత ఫ్రంట్ లైన్ వర్కర్లకు ఆమె అభినందనలు , కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత కరోనా మహమ్మారి వల్ల తలెత్తిన సంక్షోభం నుంచి కోలుకోవడానికి గల అవకాశాలకు సంబంధించి ఆమె తన అభిప్రాయాలను తెలియజేస్తూ, ఇండియా సార్క్ కోవిడ్ -19 అత్యవసర నిధిని ఏర్పాటు చేయడంతో పాటు ఈ దిశగా పలు చర్యలు తీసుకోవడంలో ఇండియా ముందు వరుసలో ఉన్నదన్నారు. అలాగే కోవిడ్ -10 టూల్స్ యాక్సిలరేటర్ ( ఎసిటి-ఎ), కోవాక్స్ కు చొరవ చూపిందన్నారు. అంతర్జాతీయ సౌర కూటమి ( ఐఎస్ ఎ), పారిస్ ఒప్పంద లక్ష్యాలు , భాగస్వామ్యం ద్వారా అంతర్జాతీయ సానుకూల వాతావరణ కార్యాచరణను చేపట్టవచ్చో ఒక ఉదాహరణగా నిలిచాయన్నారు.

మొత్తంమీద తిరిగి ఆర్థిక వ్యవస్థ విజయవంతంగా కోలుకోవడానికి ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా విస్తృత సహకారం అవసరమని అన్నారు. కోవిడ్ -19 పై పోరాటానికి సంబంధించి అన్ని రకాల ఉపకరణాలైన డయాగ్నస్టిక్, చికిత్స, వాక్సిన్‌లు లేదా సాంకేతికత లను అంతర్జాతీయంగా ఇచ్చిపుచ్చుకోవలసి ఉంది. ఇండియా వాక్సిన్ తయారీ సామర్ధ్యాన్ని మరింత పెంచేందుకు కీలక ముడి పదార్ధాలు, అత్యవసరాలను ఇండియాకు అందుబాటులో ఉంచాల్సిన అవసరాన్ని ఆమె తెలియజేశారు.

ప్రగతి సాధనకు ప్రైవేట్ రంగం , పౌర సమాజం భాగస్వామ్యం కావలసిన అవసరాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారతీయ వాక్సిన్ అభివృద్ధి దారులు సహకరించి ప్రభుత్వానికి సహేతుక ధరకు వాక్సిన్ ను అందించారని ఆమె అన్నారు. ప్రైవేటు సంస్థలు కూడా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద తమ వంతు తోడ్పడుతున్నాయి. భారత ప్రభుత్వ విధానాలు ఎం.ఎస్.ఎం.ఇలకు మద్దతు , ఆర్థిక వ్యవస్థ తిరిగి కోలుకునేందుకు భారత ప్రభుత్వం తీసుకున్న విధానాలు ఎంతగానో ప్రగతికి దోహదపడనున్నాయి.

దృఢమైన, నిరంతర ప్రగతికి సంబంధించిన సహకారానికి బహుళ పక్ష సంస్థలు డిజిటల్ ఆస్తులు, ప్రకృతి విపత్తులను తట్టుకునే ఆస్థులను రూపొందించడంలో తమవంతు పాత్ర వహించడం అవసరం. ఇందుకు మానవ అభివృద్ధిన ప్రాధాన్యతగా తీసుకోవాల్సి ఉంటుంది.ప్రాంతీయ, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించేందుకు ఇండియా కట్టుబడి ఉందని ఆమె అన్నారు.

కోవిడ్ , నాన్ కోవిడ్ ప్రాజెక్టులకు సకాలంలో ఆర్థిక సహాయాన్ని అందించినందుకు ఎడిబిని శ్రీమతి సీతారామన్ అభినందించారు. ఆసియా, పసిఫిక్‌లో ఆరోగ్య రంగం ఉద్దీపనపై మరింత దృష్టి పెట్టాల్సి ఉందని, ఇందుకు సంబంధించి ఎడిబి సమగ్ర పరిష్కారాలను రూపొందించాలని అన్నారు.

# కోవిడ్-19 కి వ్యతిరేకంగా పోరాడడానికి వైద్య సిబ్బంది అందుబాటును పెంచడం కోసం కీలకమైన నిర్ణయాలను తీసుకొనేందుకు అధికారాల ను ఇచ్చిన ప్రధాన మంత్రి

హైదరాబాద్ , మే 4:100 రోజుల పాటు కోవిడ్ సంబంధిత విధుల ను పూర్తి చేసిన వైద్య సిబ్బంది కి ప్రైం మినిస్టర్స్ డిస్ టింగ్ విశ్ డ్ కోవిడ్ నేశనల్ సర్వీస్ సమ్మాన్ ను ఇవ్వడం జరుగుతుంది

దేశం లో ప్రస్తుతం మళ్లీ తలెత్తిన కోవిడ్-19 మహమ్మారి ని దృష్టి లో పెట్టుకొని చాలినన్ని మానవ వనరుల అవసరం పెరుగుతూ ఉన్న స్థితి ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సోమవారం నాడు సమీక్షించారు. కోవిడ్ కు సంబంధించిన విధి నిర్వహణ లో వైద్యచికిత్స సిబ్బంది లభ్యత ను చెప్పుకోదగిన స్థాయి లో పెంచే అనేక ముఖ్య నిర్ణయాల ను ఈ సందర్భం లో తీసుకోవడం జరిగింది.

ఎన్ఇఇటి-పిజి ని కనీసం 4 నెలల పాటు వాయిదా వేయడం కోసం ఒక నిర్ణయాన్ని తీసుకోవడమైంది. మరి ఈ పరీక్ష ను 2021వ సంవత్సరం ఆగస్టు 31వ తేదీ కంటే ముందు నిర్వహించబోవడం లేదు. ఈ పరీక్ష ను ప్రకటించిన తరువాత దానిని నిర్వహించే కన్నా ముందు విద్యార్థుల కు కనీసం ఒక నెల వ్యవధి ని కూడా ఇవ్వడం జరుగుతుంది. ఇది అర్హత కలిగిన వైద్యులు పెద్ద సంఖ్య లో కోవిడ్ విధుల నిర్వహణ కు అందుబాటు లోకి రావడానికి వెసులుబాటు ను కల్పించగలదు.

మెడికల్ ఇంటర్న్ స్ ను ఇంటర్న్‌శిప్ రొటేశన్ లో భాగం గా వారి ఫేకల్టీ పర్యవేక్షణ లో కోవిడ్ నిర్వహణ సంబంధిత విధుల లో నియోగించడానికి అనుమతించాలని కూడా నిర్ణయించడం జరిగింది. ఫేకల్టీ ద్వారా తగినంత నేపథ్య దృష్టి ప్రసారం, పర్యవేక్షణ ల అనంతరం ఎమ్ బిబిఎస్ చివరి సంవత్సరం విద్యార్థుల ను కోవిడ్ స్వల్పం గా సోకినటువంటి కేసు ల విషయం లో పర్యవేక్షణ కు, టెలి-కన్ సల్టేశన్ వంటి సేవల ను అందజేయడానికి వినియోగించుకోవచ్చును. ఇది ప్రస్తుతం కోవిడ్ సంబంధిత కర్తవ్య నిర్వహణ లో తలమునకలు గా ఉన్న వైద్యుల పైన పని భారాన్ని తగ్గించడమే కాకుండా రోగుల కు ఇవ్వవలసిన చికిత్స తాలూకు క్రమాన్ని నిర్ణయించే దిశ లో జరుగుతున్న ప్రయత్నాల ను అభివృద్ధిపర్చనూగలదు.

పిజి విద్యార్థుల తాలూకు తాజా బ్యాచ్ లు చేరేటంత వరకు పిజి ఫైనల్ ఇయర్ విద్యార్థుల (స్థూల మరియు సూపర్ -స్పెశాలిటీస్ విభాగాల కు చెందిన వారి) సేవల ను రెసిడెంట్స్ హోదా లో వినియోగించుకొంటూ ఉండవచ్చును.

బి.ఎస్‌సి./ జిఎన్ఎమ్ అర్హత కలిగిన నర్సుల ను సీనియర్ డాక్టర్ లు మరియు నర్సు ల పర్యవేక్షణ లో పూర్తి కాలపు కోవిడ్ నర్సింగ్ విధుల లో వినియోగించుకోవచ్చును.

కోవిడ్ నిర్వహణలో సేవలను అందిస్తున్న వ్యక్తుల కు వారు కోవిడ్ డ్యూటీ లో కనీసం 100 రోజుల ను పూర్తి చేసిన తరువాత భవిష్యత్తు లో జరిపే ప్రభుత్వ రెగ్యులర్ నియామకాలలో ప్రాముఖ్యాన్ని ఇవ్వడం జరుగుతుంది.

కోవిడ్ సంబంధిత కార్యాలలో నిమగ్నం కాదలుచుకున్న వైద్య విద్యార్థుల కు/వైద్య వృత్తి నిపుణుల కు టీకా మందు ను ఇప్పించడం జరుగుతుంది. ఇందువల్ల కోవిడ్-19 కి వ్యతిరేకం గా జరుగుతున్న యుద్ధం లో పాల్గొంటున్న ఆరోగ్య రంగ శ్రమికుల కు ఉద్దేశించిన ప్రభుత్వ బీమా పథకం తాలూకు రక్షణ వృత్తి నిపుణులు అందరికీ లభించినట్లు అవుతుంది.

కోవిడ్ విధుల లో కనీసం 100 రోజులు పాలుపంచుకోవడానికి సిద్ధపడి సంతకాలు పెట్టి ముందుకు వచ్చే, ఆ కార్యభారాన్ని విజయవంతం గా ముగించే వృత్తినిపుణులు అందరికీ భారత ప్రభుత్వం తరఫున ప్రైం మినిస్టర్స్ డిస్ టింగ్ విశ్ డ్ కోవిడ్ నేశనల్ సర్వీస్ సమ్మాన్ ను కూడా ఇవ్వడం జరుగుతుంది.

డాక్టర్లు, నర్సులు, మరియు ఈ రంగానికి చెందినటువంటి ఇతరత్రా వృత్తి నిపుణులు కోవిడ్ నిర్వహణ కు ముఖ్యాధారం గా ఉన్నారు; అంతేకాదు, వారు ముందు వరుస లో నిలబడి సేవల ను అందిస్తున్న సిబ్బంది గా కూడా పేరు ను తెచ్చుకొన్నారు. రోగుల అవసరాల ను చాలా చక్క గా తీర్చడానికి గాను వీరు తగినంత సంఖ్య లో అందుబాటు లో ఉండడమనేది ఎంతో ముఖ్యం. వైద్య సముదాయం అత్యంత సమర్పణ భావం తో చేస్తున్న ప్రశంసాయోగ్యమైనటువంటి పని ని సముచిత రీతి లో గుర్తించడం జరిగింది.

డాక్టర్ లు/ నర్సు ల సేవల ను కోవిడ్ విధుల లో వినియోగించుకోవడానికి వీలు గా కేంద్ర ప్రభుత్వం 2020 వ సంవత్సరం జూన్ 16న మార్గదర్శక సూత్రాల ను జారీ చేసింది. కోవిడ్ నిర్వహణ కు అవసరమైన సదుపాయాల ను, మానవ వనరుల ను పెంచడానికి 15,000 కోట్ల రూపాయల విలువ కలిగిన ఒక ప్రత్యేకమైనటువంటి సార్వజనిక ఆరోగ్య అత్యవసర ఆలంబన ను కేంద్ర ప్రభుత్వం సమకూర్చడం జరిగింది. ఈ ప్రక్రియ ద్వారా నేశనల్ హెల్థ్ మిశన్ లో భాగం గా సిబ్బంది ని రంగం లోకి దించడం తో, అదనం గా 2206 మంది స్పెశలిస్టుల ను, 4685 మంది వైద్య అధికారుల ను, 25593 మంది స్టాఫ్ నర్సుల ను భర్తీ చేసుకోవడమైంది.

**కీలక నిర్ణయాల తాలూకు పూర్తి వివరాలు :**

కోవిడ్-19 మరో సారి విజృంభించిన దరిమిలా ఏర్పడిన స్థితి ని పరిశీలన లోకి తీసుకొని ఎన్ఇఇటి (పిజి) -2021 ని వాయిదా వేయడం జరిగింది. ఈ పరీక్ష ను 2021వ సంవత్సరం ఆగస్టు 31వ తేదీ కన్నా ముందు నిర్వహించబోవడం లేదు. పరీక్ష ను గురించి ప్రకటన చేసిన తరువాత దానిని నిర్వహించే కన్నా ముందు కనీసం ఒక నెల వ్యవధి ని ఇవ్వడం జరుగుతుంది.

ఎన్ఇఇటి కి హాజరు కాబోయే అభ్యర్థుల ను గుర్తించి వారిని ఈ ఆపత్కాలం లో కోవిడ్-19 సేవల రోజుల దళం లో చేరవలసిందిగా అభ్యర్థించడం లో రాష్ట్ర ప్రభుత్వాలు/కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు అన్ని ప్రయత్నాల ను చేయవలసి ఉంటుంది. ఈ ఎమ్ బిబిఎస్ డాక్టర్ ల సేవల ను కోవిడ్-19 నిర్వహణ లో ఉపయోగించుకోవచ్చును. రాష్ట్ర ప్రభుత్వాలు/కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు ఇక మీదట మెడికల్ ఇంటర్న్ లను ఇంటర్న్‌శిప్ రొటేశన్ లో భాగం గా వారి ఫేకల్టీ పర్యవేక్షణ లో కోవిడ్ నిర్వహణ సంబంధి విధుల లో నియోగించుకోవచ్చును. ఎమ్ బిబిఎస్ చివరి సంవత్సరం విద్యార్థుల సేవల ను ఫేకల్టీ ద్వారా తగిన నేపథ్య దృష్టి, పర్యవేక్షణ ల అనంతరం తేలికపాటి కోవిడ్ కేసు ల పర్యవేక్షణ కు, టెలి- కన్సల్టేశన్ వంటి సేవల ను అందించడం కోసం వినియోగించుకోవచ్చును.

పిజి ఫైనల్ ఇయర్ లో ఉన్నవారి సేవలను కొనసాగించడం:

పిజి ఫైనల్ ఇయర్ విద్యార్థుల (స్థూల మరియు సూపర్ స్పెశాలిటీస్ విభాగాలకు చెందిన వారి) సేవల నురెసిడెంట్స్ హోదా లో ఉపయోగించుకోవడాన్ని- పిజి తాజా బ్యాచ్ ల విద్యార్థులు చేరే వరకు- కొనసాగించుకొనేందుకు అవకాశం ఉంటుంది. అదే విధం గా, సీనియర్ రెసిడెంట్స్/రిజిస్ట్రార్స్ సేవల ను- కొత్త నియామకాలు జరిగేటంత వరకు- కొనసాగించుకోవచ్చును.

నర్సింగ్ సిబ్బంది:

బి.ఎస్‌సి./జిఎన్ఎమ్ అర్హత కలిగిన నర్సుల ను- సీనియర్ డాక్టర్ లు, నర్సుల పర్యవేక్షణ లో- ఐసియు తదితర విభాగాల లో పూర్తి కాలపు కోవిడ్ నర్సింగ్ విధుల లో వినియోగించుకోవచ్చును. ఎమ్.ఎస్‌సి. నర్సింగ్ విద్యార్థులు, పోస్ట్ బేసిక్ బి.ఎస్‌సి. (ఎన్) మరియు పోస్ట్ బేసిక్ డిప్లొమా నర్సింగ్ విద్యార్థులు.. వీరు రిజిస్టర్డ్ నర్సింగ్ ఆఫీసర్స్ అయినందువల్ల, వీరి సేవల ను ఆసుపత్రి ప్రోటోకాల్స్/ విధానాల కు అనుగుణం గా కోవిడ్-19 రోగుల పట్ల శ్రద్ధ తీసుకోవడానికి వినియోగించుకోవచ్చును. అలాగే జిఎన్ఎమ్ లేదా బి.ఎస్‌సి. (నర్సింగ్) ఫైనల్ ఇయర్ విద్యార్థులు- ఎవరైతే ఇంకా ఆఖరి పరీక్ష కోసం హాజరవడం కోసం ఎదురు చూస్తున్నారో- వారికి సీనియర్ ఫేకల్టీ పర్యవేక్షణ లో వివిధ ప్రభుత్వ/ ప్రైవేటు ఆసుపత్రుల లో కోవిడ్ నర్సింగ్ తాలూకు పూర్తి కాలపు విధుల ను కూడా ఇవ్వవచ్చును.

ఆరోగ్య సంరక్షణ సంబంధ వృత్తి నిపుణుల సేవల ను- వారికి ఇచ్చినటువంటి శిక్షణ మరియు సర్టిఫికెట్ ల ఆధారం గా- కోవిడ్ నిర్వహణ లో సహాయం అందించడానికి గాను వినియోగించుకోవచ్చును.

ఈ రకం గా కూడగట్టిన అదనపు మానవ వనరుల ను కోవిడ్ నిర్వహణ సంబంధ సదుపాయాల లో మాత్రమే ఉపయోగించుకోవడం జరుగుతుంది.

**బి. ప్రోత్సాహకాలు/ సేవ తాలూకు గుర్తింపు**

కోవిడ్ నిర్వహణ లో సేవల ను అందిస్తున్న వ్యక్తుల కు, వారు కోవిడ్ సంబంధిత విధుల లో కనీసం 100 రోజులు పూర్తి చేసిన తరువాత, భవిష్యత్తు లో జరిగే ప్రభుత్వ రెగ్యులర్ నియామకాల లో పెద్దపీట వేయడం జరుగుతుంది.

పైన ప్రస్తావించిన కార్యక్రమాన్ని అమలు చేయడానికి అదనపు మానవ శక్తి ని రంగం లోకి దించడం కోసం రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాలు ఒప్పంద పద్ధతి లో చేపట్టే మానవ వనరుల భర్తీ కి ఉద్దేశించినటువంటి నేశనల్ హెల్థ్ మిశన్ (ఎన్‌హెచ్‌ఎమ్) నియమావళి ని అమలు పరచడాన్ని పరిశీలించవచ్చును. ఎన్‌హెచ్ఎమ్ నియమావళి లో ప్రస్తావించిన ప్రకారం ప్రతిఫలం పై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రాల కు వెసులుబాటు లభిస్తుంది. కోవిడ్ సంబంధిత విశిష్ట సేవల కు సముచితమైనటువంటి ఒక గౌరవ భృతి ని అందజేయడం గురించి కూడా పరిశీలించవచ్చును.

కోవిడ్ సంబంధిత పనుల లో నిమగ్నం కాదలచుకొన్న వైద్య విద్యార్థుల కు/ వైద్య వృత్తి నిపుణుల కు అందుకు అవసరమైనటువంటి టీకా మందు ను ఇప్పించడం జరుగుతుంది. ఆ విధం గా భర్తీ చేసుకొన్న ఆరోగ్య రంగ వృత్తి నిపుణుల కు, కోవిడ్-19 తో పోరు లో తలమునకలైన ఆరోగ్య రంగ శ్రమికుల కు ఉద్దేశించిన ప్రభుత్వ బీమా పథకం లో ప్రస్తావించిన మేరకు రక్షణ కవచం లభిస్తుంది.

కోవిడ్ విధుల లో కనీసం 100 రోజుల పాటు పాల్గొనడానికి, మరి ఆ విధుల ను జయప్రదం గా పూర్తి చేసినటువంటి వృత్తి నిపుణులందరికీ కూడా భారత ప్రభుత్వం పక్షాన ప్రైం మినిస్టర్స్ డిస్ టింగ్ విశ్ డ్ కోవిడ్ నేశనల్ సర్వీస్ సమ్మాన్ ను కూడా ఇవ్వడం జరుగుతుంది.

రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రక్రియ ద్వారా భర్తీ చేసుకొనే అదనపు ఆరోగ్య రంగ వృత్తి నిపుణుల ను ప్రైవేటు కోవిడ్ ఆసుపత్రుల తో పాటు కేసు ల తాకిడి అధికం గా ఉన్న ప్రాంతాల కు పంపవచ్చును.

ఆరోగ్య విభాగం లో, వైద్య విభాగం లో ఖాళీ గా మిగిలి ఉన్నటువంటి డాక్టర్ పోస్టులు, నర్సు ఉద్యోగాలు, ఇతర సంబంధిత వృత్తి నిపుణుల కొలువులు మరియు ఇతరత్రా ఆరోగ్య సంరక్షణ సిబ్బంది నౌకరీ లను ఎన్‌హెచ్‌ఎమ్ నియమావళి ఆధారం గా ఒప్పంద నియామకాల ద్వారా 45 రోజుల లోపల త్వరిత గతి ప్రక్రియ ల ద్వారా భర్తీ చేయవచ్చును.

మానవ శక్తి ని గరిష్ఠ స్థాయి లో అందుబాటు లోకి తీసుకు రావడానికి గాను పైన పేర్కొన్నటువంటి ప్రోత్సాహకాల గురించి ఆలోచన చేయవలసింది గా రాష్ట్రాల ను/ కేంద్ర పాలిత ప్రాంతాల ను కోరడమైంది.

# మూడు వేల ఆక్సిజన్ కాన్‌సన్‌ట్రేటర్ల కన్‌సైన్‌మెంట్ కస్టమ్స్ అధికారుల వద్ద ఆగలేదు: ఆర్థిక మంత్రిత్వ శాఖ

హైదరాబాద్ , మే 4:మూడు వేల ఆక్సిజన్ కాన్‌సెన్‌ట్రేటర్లకు సంబంధించిన కన్‌సైన్‌మెంట్ కస్టమ్స్ అధికారుల పెండింగ్‌లో ఉందని ఢిల్లీ హైకోర్టులో ప్రస్తావనకు వచ్చింది. ప్రస్తుతం అటువంటి కన్‌సైన్‌మెంట్ ఏదీ కస్టమ్స్ అధికారుల వద్ద పెండింగ్‌లో లేదన్న విషయాన్ని ప్రభుత్వ న్యాయవాది ఢిల్లీ ఉన్నత న్యాయస్థానానికి స్పష్టం చేశారు.

అయితే, మూడు వేల ఆక్సిజన్ కాన్‌సన్‌ట్రేటర్లు కస్టమ్స్ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాయన్న వార్తలు సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తాయి. మేం మరోసారి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశాం, కస్టమ్స్ వద్ద అలాంటి సరుకు లేదు. అయితే, కన్‌సైన్‌మెంట్‌కు సంబంధించిన ఒక ఛాయాచిత్రం ట్విట్టర్‌లో ఉంచారు. ఆ ఫొటోను ఎక్కడ తీశారో ఎవరికైనా సమాచారం ఉంటే మాకు తెలియజేయవచ్చు. మేం సత్వరం చర్యలు తీసుకుంటాం.

# బిహార్‌లో మే 15 వరకు పూర్తిస్థాయి లాక్‌డౌన్

పాట్నా, మే 4:: బిహార్‌లో పెరుగుతున్న కొవిడ్ కేసుల మధ్య ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధిస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. మే 15వ తేదీ వరకు లాక్‌డౌన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కేబినెట్ మంత్రులు, అధికారులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్వీట్ చేశారు. వివరణాత్మక మార్గదర్శకాలు, ఇతర కార్యాకలాపాలకు సంబంధించి సంక్షోభ నిర్వహణ బృందాన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో కరోనాను నియంత్రించాలని, లాక్‌డౌన్ ప్రకటించాలని పాట్నా హైకోర్టు సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఇంతకు ముందు ప్రభుత్వం రాష్ట్రంలో నైట్ కర్ఫ్యూ విధించింది. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు కొనసాగుతున్నది. బిహార్‌లో నిన్న ఒకే రోజు 11,407 కరోనా పాజిటివ్ కేసులు రికార్డవగా.. 82 మంది మృత్యువాతపడ్డారు. ఇప్పటి వరకు మొత్తం కేసులు 5.09లక్షలకు చేరగా.. 2,800 వరకు మృత్యువాతపడ్డారు.

# దేశవ్యాపితంగా ఆయుష్ 64 మరింతగా అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకుంటున్న ఆయుష్ మంత్రిత్వశాఖ

హైదరాబాద్ , మే 4:శతాబ్ద కాలంలో దేశం కోవిడ్ -19 రూపంలో ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య సమస్యను పరిష్కరించే దిశలో ఆయుష్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు కీలకంగా మారాయి. గత కొన్ని వారాలుగా కోవిడ్ కేసుల సంఖ్య ఆందోళన కలిగించే విధంగా వేగంగా పెరుగుతున్న సమయంలో వ్యక్తులు, వైద్యులు ఆయుష్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి.

ఈ దిశలో కోవిడ్-19 చికిత్స కోసం వనమూలికలతో తయారుచేసిన ఆయుష్-64 అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మలేరియా నివారణకు 1980లో ఆయుష్-64ని అభివృద్ధి చేశారు. దీనిని ఔషధ ప్రమాణాలు, నియంత్రణలకు లోబడి అభివృద్ధి చేశారు. దీనిని తేలికపాటి నుంచి మితమైన కోవిడ్ కేసులకు చికిత్స అందించడానికి ఏ మేరకు ఉపయోగించవచ్చునన్న అంశంపై కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సిఎస్ఐఆర్), వైద్య కళాశాలలు ఇతర పరిశోధనా సంస్థలతో కలసి ఆయుర్వేద శాస్త్రాల కేంద్ర పరిశోధనా మండలి (సిసిఆర్ఎఎస్) పరిశోధనలను నిర్వహించింది. ప్రముఖ శాస్త్రవేత్తల పర్యవేక్షణలో సాగిన ఈ పరిశోధనల్లో ఆయుష్ 64 యాంటీవైరల్, ఇమ్యూన్-మాడ్యులేటర్ మరియు యాంటిపైరెటిక్ లక్షణాలు కలిగి ఉందని వెల్లడయ్యింది. దీనిని లక్షణం లేని, తేలికపాటి మరియు మితమైన కోవిడ్-19 కేసుల చికిత్స కోసం ఉపయోగించవచ్చునని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. పరిశోధనల నివేదికల ఆధారంగా ఈ మందును కోవిడ్-19 చికిత్స కోసం వినియోగించడానికి అనుమతించాలని ఆయుష్ మంత్రిత్వశాఖ నిర్ణయించింది. దీనికి సంబందించి 2021 ఏప్రిల్ 29వ తేదీన మంత్రిత్వశాఖ అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

ఆయుష్-64 దేశంలోని అన్ని ప్రాంతాలల్లో కావలసిన పరిమాణంలో లభించేలా చూడడానికి ఆయుష్ మంత్రిత్వశాఖ చర్యలను అమలు చేస్తోంది. తక్కువ సమయంలో ఎక్కువ మందికి ఆయుష్-64ను అందుబాటులోకి తేవడానికి దీని ఉత్పత్తిని ఎక్కువ చేయాలనీ నిర్ణయించారు. పెద్ద మొత్తంలో వాణిజ్య సరళిలో ఆయుష్-64ని ఉత్పత్తి చేయడానికి సిసిఆర్ఎఎస్ మరియు నేషనల్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్ ( ఎన్ ఆర్ డిసి ) ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. ఆయుష్-64ని తేలికపాటి నుంచి ఒక మోస్తరు కోవిడ్ లక్షణాలు వున్నవారికి చికిత్స ఇవ్వడానికి వినియోగించాలని సూచిస్తూ రాష్ట్రాల్లో లైసెన్సులను జారీ చేసే అధికారులకు సమాచారం అందించింది.

ఆయుష్-64 ఉత్పత్తిని ఎక్కువ చేసి దీనిని దేశంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులోకి తీసుకొని రావడానికి ఔషధ కర్మాగారాలకు అనుమతులు మంజూరు చేయాలని ఆయుష్ మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఆసక్తి కలిగిన సంస్థలు సాంకేతిక పరిజ్ఞానం బదిలీ కోసం సిసిఆర్ఎఎస్, ఎన్ ఆర్ డిసి లను సంప్రదించాలని ఆయుష్ మంత్రిత్వశాఖ కోరింది. ఆయుష్ -64 తయారీలో మందుల తయారీదారులకు సిసిఆర్ఎఎస్ సాంకేతిక సహాయాన్ని అందిస్తుంది. డ్రగ్స్, కాస్మటిక్స్ రూల్స్ 1945నిబంధనలకు లోబడి ఉండే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి లైసెన్సులను మంజూరు చేయడానికి రాష్ట్రాల అధికారులు చర్యలు తీసుకుంటారు.

ఇప్పటికే పనిచేస్తున్న ఆయుష్ వ్యవస్థగా గుర్తింపు పొందిన జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఆయుష్-64 ఉత్పత్తి, సరఫరా, అందుబాటు అంశాలలో తమ వంతు సహకారాన్ని అందిస్తాయని ఆశిస్తున్నారు. ఆయుర్వేద, యోగా ప్రక్రియల భాగంగా జాతీయ క్లినికల్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం ఆయుష్ -64 వాడకాన్ని రాష్ట్ర ఆరోగ్య అధికారులు ప్రోత్సహించవలసి ఉంటుంది.

# ఆటోవాలాలకు రూ.5000 చొప్పున ఆర్థిక సాయం




న్యూఢిల్లీ, మే 4:: దేశంలో కరోనా మహమ్మారి విజృంభిస్తున్నది. రోజూ లక్షల మంది మహమ్మారి బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సర్కారు పేదలకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు కీలక నిర్ణయం తీసుకున్నది. ఢిల్లీలోని ఆటోవాలాలు, ట్యాక్సీ వాలాలకు రూ.5000 చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ వెల్లడించారు.

అదేవిధంగా, ఢిల్లీలోని రేషన్‌కార్డుదారులు అందరికీ రెండు నెలలపాటు ఉచిత రేషన్ అందించనున్నట్లు ఢిల్లీ ముఖ్యమంత్రి ప్రకటించారు. దీనివల్ల మొత్తం 72 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అయితే రెండు నెలలపాటు ఉచిత రేషన్ అందిస్తున్నంత మాత్రాన రెండు నెలలపాటు లాక్‌డౌన్ కొనసాగుతుందని భావించవద్దని ఆయన స్పష్టం చేశారు. నిరుపేదల సహాయార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# ఇండియా నుంచి వస్తే జైలు..

## వెనక్కి తగ్గిన ఆస్ట్రేలియా ప్రధాని

మెల్‌బోర్న్, మే 4:: ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్ వెనక్కి తగ్గారు. ఇండియా నుంచి వస్తే జైల్లో వేస్తామన్న కఠిన నిబంధనపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఇండియాలో ఉన్న ఆస్ట్రేలియన్ల తోపాటు అక్కడి మానవ హక్కుల సంఘాలు, ప్రధాని సన్నిహితులు కూడా ఈ నిబంధనపై విమర్శలు గుప్పించారు. నీకెంత ధైర్యం.. నీ చేతులకు రక్తం అంటుకుంది అని ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైకేల్ స్లేటర్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన మరుసటి రోజే ప్రధాని మోరిసన్ మెత్తబడ్డారు.

మంగళవారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ.. ఈ నిషేధాన్ని ఉల్లంఘించిన ఆస్ట్రేలియన్లను జైల్లో వేసే అవకాశాలు అసలు లేవు అని అన్నారు. ప్రస్తుతం ఇండియాలో 9 వేల మంది వరకూ ఆస్ట్రేలియన్లు ఉన్నారు. అందులో ఐపీఎల్‌లో ఆడుతున్న ప్రముఖ క్రికెటర్లు, కామెంటేటర్లు కూడా ఉండటం గమనార్హం. తమ పట్ల ప్రధాని కఠినంగా వ్యవహరించడంపై మాజీ క్రికెటర్ ట్విటర్ వేదికగా తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాని మోరిసన్ స్పందించారు.

నా చేతులకు రక్తం అంటుకుందన్న వ్యాఖ్యలు అర్థం లేనివి. ఆస్ట్రేలియాలో కరోనా మూడో వేవ్‌ను అడ్డుకోవడానికే నేను ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నాను. అయినా వాళ్లను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని మోరిసన్ వెల్లడించారు. మే 15 తర్వాత ఇండియాలో ఇరుక్కుపోయిన ఆస్ట్రేలియన్లను స్వదేశానికి తీసుకువచ్చే అవకాశాలు ఉన్నట్లు చెప్పారు.

# బెంగళూరు కొడగు జిల్లాలో వారంలో ఐదు రోజులపాటు సంపూర్ణ లాక్‌డౌన్..

హైదరాబాద్ , మే 4: బెంగళూరులో కొడగు జిల్లాలో కరోనా కేసులు పెరుగుతున్నందున వారంలో ఐదు రోజులపాటు సంపూర్ణంగా లాక్‌డౌన్ అమలు చేస్తున్నారు. వారంలో ఐదు రోజులు సంపూర్ణంగా బంద్ పాటించి చివరి రెండు రోజులు నిత్యావసరాలకు నిబంధనలతో కొనుగోళ్లకు అవకాశం కల్పించారు. హోం స్టేలు, దుకాణాలు అన్నీ మూసివేసేలా ఆదేశించారు. అనవసరంగా రోడ్డెక్కితే వాహనాలు సీజ్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రజలు కూడా ఇందుకు సహకరిస్తేనే కొవిడ్ నియంత్రణ సాధ్యమవుతుందని జిల్లా యంత్రాంగం పేర్కొం ది. తీవ్రరూపం దాలుస్తున్న కొవిడ్ నియంత్రణకు ఇదొక్కటే మార్గంగా ఉందని ప్రజలు అనవసరంగా బయటికి రావదన్నారు.

# కేవలం ఆన్‌లైన్ క్లాసులే అయితే స్కూళ్లు ఫీజులు తగ్గించాల్సిందే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 4:: కరోనా కారణంగా గతేడాది నుంచి స్కూళ్లన్నీ ఆన్‌లైన్ క్లాస్‌లు నిర్వహిస్తున్న సంగతి తెలుసు కదా. సాధారణ స్కూలు తరగతులతో పోలిస్తే ఈ ఆన్‌లైన్ క్లాస్‌ల నిర్వహణ తల్లిదండ్రులకు భారంగా మారింది తప్ప స్కూళ్లకు ఇంకా ఖర్చు తగ్గించింది. అయినా కూడా ఫీజులు విషయంలో ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు వెనక్కి తగ్గలేదు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.. కేవలం ఆన్‌లైన్ క్లాసులే అయితే కచ్చితంగా ఫీజులు తగ్గించాల్సిందే అని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ క్లాస్‌ల కారణంగా స్కూలు నిర్వహణ ఖర్చులు తగ్గాయి కాబట్టి ఆ ప్రయోజనాన్ని తల్లిదండ్రులకు బదిలీ చేయాలని అత్యున్నత న్యాయస్థానం చెప్పింది.

కొవిడ్ కారణంగా వాళ్లు పడిన ఇబ్బందులను స్కూలు యాజమాన్యాలు అర్థం చేసుకోవాలని, ఆమేరకు వారికి ఉపశమనం కలిగించాలని ఆదేశించింది. విద్యార్థులకు అందించని వసతులకు కూడా ఫీజులు వసూలు చేయడం లాభార్జనే అవుతుందని, అది మానుకోవాలని హితవు పలికింది. ఇక గతేడాది లాక్‌డౌన్ కారణంగా చాలా కాలం స్కూళ్లు తెరవలేదు. దీని కారణంగా పెట్రోల్/డీజిల్, కరెంటు, నిర్వహణ ఖర్చు, నీటి ఛార్జీలు, స్టేషనరీ ఛార్జీలు వంటివి మిగిలిపోయాయి. వీటిని కూడా దృష్టిలో ఉంచుకోవాలి అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.

# పెరిగిన పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

న్యూఢిల్లీ, మే 4:: దేశంలో 18 రోజులుగా స్థిరంగా ఉన్న పెట్రోల్, డీజిల్ ధరలు మంగళవారం పెరిగాయి. పెట్రోల్‌పై లీటర్‌కు 12-15 పైసలు, డీజిల్‌పై లీటర్‌కు 15-18 పైసలు పెంచాయి ఆయిల్ కంపెనీలు. దీంతో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటర్‌కు 90.55కు, డీజిల్ రూ.80.91కి చేరింది. పెట్రోల్, డీజిల్ ధరలను చివరిసారి ఏప్రిల్ 15న సవరించారు. అప్పుడు పెట్రోల్ లీటర్‌కు 16 పైసలు, డీజిల్ 14 పైసలు పెరిగింది. ఇండియాలో రోజువారీగా పెట్రోల్, డీజిల్ ధరలను సవరిస్తారు. అయితే ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో చాలా రోజులుగా పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉన్నాయి.

ఇండియాలో లాక్‌డౌన్లు, కర్ఫ్యూల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్‌కు డిమాండ్ తక్కువగా ఉంది. అయితే అంతర్జాతీయంగా చూస్తే అటు అమెరికా, యూరప్ దేశాల్లో ఆంక్షలు సడలించడంతో క్రూడాయిల్‌కు డిమాండ్ పెరుగుతోంది. సోమవారం బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్‌కు 14 సెంట్లు పెరిగి 67.70 డాలర్లకు చేరగా.. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్‌మీడియట్ క్రూడాయిల్ ధర కూడా బ్యారెల్‌కు 14 సెంట్లు పెరిగి 64.63 డాలర్లకు చేరింది.

# తెలంగాణలో రాబోయే రెండు రోజులు వర్షాలు



హైదరాబాద్ , మే 4:రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర ఇంటీరియర్ కర్ణాటకలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని, దీని ప్రభావంతో ఉరుములు, మెరుపులతో పాటు వడగళ్లతో వర్షం కురుస్తుందని పేర్కొంది. ఆదిలాబాద్, కొత్తగూడెం, హైదరాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, ములుగు, నల్లగొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ రూరల్, అర్బన్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పలు చోట్ల వానలు పడే అవకాశం ఉన్నదిన పేర్కొన్నది.

ఇదిలా ఉండగా.. ఉపరితల ద్రోణి ప్రభావంతో సోమవారం రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా గండిపేట, వికారాబాద్, హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్, శేరిలింగంపల్లిలో దాదాపు 5 సెంటీమీటర్ల చొప్పున, ములుగు జిల్లా అలుబాక, ఆదిలాబాద్ జిల్లా బోథ్, సొనాల, నిర్మల్ జిల్లా ముథోల్, భైంసా, కుబీర్, సారంగాపూర్, నిజామాబాద్ జిల్లా దర్పల్లి, కమ్మర్‌పల్లి, జగిత్యాల జిల్లా జగ్గాసాగర్ తదితర ప్రాంతాల్లో దాదాపు 3 సెంటీమీటర్ల చొప్పున వర్షం పడింది. సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లోని పలుచోట్ల 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచడంతోపాటు పిడుగులు పడ్డాయి. వర్షాలతో ఉష్ణోగ్రతలు తగ్గాయి.

# బ్లాక్ మెయిలింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి : బాల్కా సుమన్

హైదరాబాద్ , మే 4: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్ అని ప్రభుత్వ విప్ బాల్కా సుమన్ విమర్శించారు. రేవంత్ రెడ్డి తీరు గుమ్మడికాయ దొంగ ఎవరంటే.. భుజాలు తడుముకున్నట్లు ఉందని విమర్శించారు.

ఈటల భూ అక్రమాలపై ఐదుగురు ఐఏఎస్‌లతో ప్రభుత్వం కమిటీ వేసిందని, అన్ని విషయాలు బయటకొస్తే రేవంత్ రెడ్డి నిజస్వరూపం తెలుతుందని అన్నారు. దేవరయాంజల్ భూముల్లో అక్రమాలను ప్రభుత్వం నిగ్గు తేల్చుతుందని సుమన్ పేర్కొన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్‌ను సమర్థించాల్సింది పోయి.. బట్టకాల్చి మీదేస్తారా.! అని నిలదీశారు. ఏ విషయమైనా విచారణలో బయటకొస్తుంది.. అప్పుడే ఆగమాగం ఎందుకు అని ప్రశ్నించారు.

బినామీల వ్యవహారం బయటపడుతుందని రేవంత్ రెడ్డి భయం పట్టుకుంది. ప్రజాక్షేత్రంలో అందరి సంగతి తేలుతుందని అన్నారు. రేవంత్ తీరు గురవిందను గుర్తు చేస్తున్నదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కబ్జాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నాడు కాబట్టే భయపడుతున్నాడని అన్నారు.

భూ అక్రమాలపై ఐదుగురు ఐఏఎస్ అధికారులతో సీఎం కేసీఆర్ విచారణ కమిటీ వేశారంటేనే ఆయన చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు.



# ఈశాన్య రాష్ట్రాల్లో ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటుకు ఎండివోఎన్ఈఆర్ ఏర్పాట్లు: డాక్టర్ జితేంద్ర సింగ్

హైదరాబాద్ , మే 4:ఈశాన్య ప్రాంత అభివృద్ధి (డోనెర్), ఎంవోఎస్ పిఎంఓ, సిబ్బంది, ప్రజా మనోవేదనలు, పెన్షన్లు, అణుశక్తి మరియు అంతరిక్ష అభివృద్ధి కేంద్ర మంత్రి (స్వతంత్ర ఛార్జ్) డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు మాట్లాడుతూ..డోనెర్ మంత్రిత్వ శాఖ అనుబంధ మరియు అభివృద్ధిలో చురుకైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అన్ని ఈశాన్య రాష్ట్రాల్లోని ఆక్సిజన్ ప్లాంట్లతో సహా కొవిడ్ సంబంధిత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని ఈ రోజు జరిగిన సమీక్షా సమావేశంలో తెలిపారు. మంత్రిత్వ శాఖ అందించిన ఆర్థిక సహాయంతో అరుణాచల్ ప్రదేశ్ లోని తవాంగ్ లో ఒక ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల మారుమూల మరియు సుదూర ప్రాంతాలలో మరెన్నో ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. 5 కోట్ల రూపాయల వ్యయంతో ఐదు మొబైల్ ఆక్సిజన్ వ్యాన్ల కోసం అరుణాచల్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను కూడా మంత్రిత్వ శాఖ చురుకుగా పరిశీలిస్తోంది.

కోవిడ్ -19 వ్యాప్తికి వ్యతిరేకంగా పోరాడటానికి గ్యాప్ ఫండింగ్ కోసం గత మార్చిలో ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చిన రూ .25 కోట్ల యునైటెడ్ ఫండ్ సమర్థవంతంగా అనేక ఆసుపత్రులలో కీలకమైన ఆరోగ్య పరికరాల కొనుగోలుకు వరంగా మారిందని డాక్టర్ జితేంద్ర సింగ్ సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కడా కూడా ఆక్సిజన్ కొరత లేదని, గత ఏడాది సకాలంలో సరఫరా చేయడం వల్ల వాటిలో కొన్ని మిగులు నిల్వలు ఉన్నాయని ఆయన అన్నారు.లాక్డౌన్ -1 ప్రారంభంలో నార్త్ ఈస్టర్న్ రీజియన్ అభివృద్ధి మంత్రిత్వ శాఖ (డోనెర్) ముందస్తుగా రూ .25 కోట్ల మొత్తాన్ని అందుబాటులో ఉంచినట్టు డోనర్ మంత్రి గుర్తు చేశారు. సమర్థవంతమైన సన్నాహక చర్యల కారణంగా ఆ సమయంలో ఈశాన్య రాష్ట్రాలు కరోనా రహితంగా ఉన్నాయన్నారు. సిక్కిం మరియు మణిపూర్ వంటి అనేక రాష్ట్రాలు ఆ సమయంలో పూర్తిగా కరోనా రహితంగా ఉన్నాయి. నార్త్ ఈస్టర్న్ రీజియన్ అభివృద్ధి మంత్రిత్వ శాఖ (డోనెర్), మౌలిక సదుపాయాల పనులను చేపట్టడంతో పాటు, ఏదైనా ప్రకృతి లేదా అసహజ విపత్తు సంభవించినప్పుడు ఈశాన్య రాష్ట్రాల సహాయానికి కూడా సహకరిస్తుంది. గత సంవత్సరం అస్సాం మరియు అరుణాచల్ ప్రదేశ్‌లో సంభవించిన భూకంపాన్ని ఆయన ఉదహరించారు. మంత్రిత్వ శాఖ అధికారులు చాలా మంది కొవిడ్ బారిన పడి ఆస్పత్రిలో చేరారని తెలిపారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి డోనెర్ మంత్రిత్వ శాఖ యొక్క 100 శాతం బడ్జెట్ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ముందుగానే ఖర్చు చేయబడిందని తెలిసి మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

2020 మార్చిలో లాక్‌డౌన్ ప్రకటించిన వెంటనే, అవసరమైన సామాగ్రిని తీసుకెళ్లే ఎయిర్ కార్గో విమానాలు ఈశాన్య ప్రాంతంతో పాటు జమ్మూ ఢ కాశ్మీర్ మరియు లడఖ్ వంటిపాలిత ప్రాంతాలు, ద్వీప భూభాగాలతో సహా సుదూర ప్రాంతాలకు అందించేందుకు ప్రాముఖ్యత ఇచ్చేందుకు ప్రధాని శ్రీ నరేంద్రమోదీ చొరవ తీసుకున్నారని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తు చేసుకున్నారు. ఈసారి కూడా ఈశాన్య రాష్ట్రాలకు ప్రాధాన్యత ప్రాతిపదికన సహాయం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

ఏ అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అన్ని ఈశాన్య రాష్ట్రాలతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతున్నామని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఇటీవల అస్సాంలో భూకంపం సంభవించిన సందర్భంగా మంత్రిత్వ శాఖ పెద్ద ఎత్తున సమన్వయ కార్యకలాపాలను చేపట్టిందని మంత్రి చెప్పారు.

# ఈ నెల 17న ఎల్డీఎఫ్ భేటీ.. ప్రభుత్వ ఏర్పాటు, ప్రమాణ స్వీకారంపై నిర్ణయం..!

తిరువనంతపురం, మే 4:: ఇటీవల వెల్లడైన కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) వరుసగా రెండోసారి ఘన విజయం సాధించి రికార్డు నెలకొల్పింది. దాంతో మరోసారి పినరయి విజయన్ ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపడుతారనే విషయం స్పష్టమైంది. అయితే మంత్రిత్వ శాఖల కేటాయింపు, ప్రభుత్వ ఏర్పాటు ముహూర్తం, ప్రమాణ స్వీకార తేదీ తదితర అంశాలపై కూటమిలోని అన్ని పార్టీలు భేటీ అయి చర్చించాల్సి ఉంది.

ఈ నేపథ్యంలో రెండు వారాల్లో కూటమిలోని అన్ని పార్టీలతో చర్చలు జరిపి మే 17న ఎల్డీఎఫ్ తుది సమావేశం ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు ఆ కూటమి కన్వీనర్, సీపీఎం యాక్టింగ్ స్టేట్ సెక్రెటరీ ఏ విజయరాఘవన్ తెలిపారు. మే 17న జరిగే సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటు, ప్రమాణ స్వీకార తేదీలపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు.

# ముస్లిం సోదరులకు మంత్రి నిరంజన్‌రెడ్డి గిఫ్ట్ ప్యాకెట్లు అందజేత



వనపర్తి, మే 4: : రంజాన్ పండుగను పురస్కరించుకుని వనపర్తి జిల్లా కేంద్రంలోని ఈద్గా మజీద్ ప్రాంగణంలో ముస్లిం సోదరులకు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం ప్రభుత్వ గిఫ్ట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ షాకీర్ హుస్సేన్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరో తేది తర్వాత తెలంగాణాలోనూ లాక్ డౌన్?

హైదరాబాద్ , మే 4:కరోనా సెకండ్ వేవ్ విజృంభణ కొనసాగుతున్న నేపథ్యంలో కట్టడి చర్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టి పెట్టారు. కరోనా కేసుల తీవ్రత పెరుగుతూ.. వైద్యరంగంపై ఒత్తిడి కొనసాగుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు, నిపుణుల సూచనల మేరకు కట్టడి అంశాలపై సీఎం కేసీఆర్ సమాలోచనలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఏపిలో కర్ఫ్యూ సమయం పొడిగింపు, ఒడిషాలో లాక్‌డౌన్ వంటి చర్యలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. కేంద్రం లాక్ డౌన్‌పై రాష్ట్రాలే నిర్ణయాలు తీసుకోవాలని సోమవారం ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం లాక్‌డౌన్ ఉండదని ఇప్పటికి పలుమార్లు ప్రక టించింది. అయితే కట్టడికి సంబంధించి సీఎం వివిధ వర్గా లతో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. మే 8 ఉదయం వరకు నైట్ కర్ఫ్యూ ఆంక్షలు కొనసాగనుండగా, తర్వాత ఏం చేద్దాం అన్న అంశంపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇప్పటికే కరోనా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా సీఎంవో కార్యదర్శి రాజశేఖర్ రెడ్డిని నియమించి ఎప్పటికపుడు మందులు, బెడ్లు, ఇతర వసతుల కొరత లేకుండా.. జాగ్ర త్తలు తీసుకుంటున్న సీఎం కేసీఆర్ మరో వైపు నియామ కాల ప్రక్రియపై దృష్టి సారించారు. ఆస్పత్రుల్లో ఖాళీల భర్తీకి కలెక్టర్లకు అధికారాలిచ్చారు. ఓ వైపు వైద్యపరంగా సన్నద్ధత, సౌకర్యాల కల్పన కొనసాగిస్తూనే.. మరోవైపు దేశవ్యాప్త పరిణామాలు, భవిష్యత్తు సవాళ్లపై దృష్టి సారించారు. కనీసం రెండు వారాల లాక్‌డౌన్ విధించా లని నిపుణులు సూచిస్తుండగా, ఆదివారం ఒడిషా ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటిం చింది. సుప్రీంకోర్టు కూడా.. లాక్‌డౌన్ చివరి అస్త్రం అని సూచిస్తోంది. ప్రస్తుతం టెస్టింగ్ కిట్ల కొరత కూడా తీవ్రంగా ఉండగా, ప్రతిరోజూ మోగుతున్న మరణమృదంగం.. పెరుగుతున్న మృతులసంఖ్య కలవరపెడుతోంది. ప్రస్తు తం ప్రతిరోజూ మూడుసార్లు సమీక్ష జరపాలని, కరోనా ఇబ్బందులను అధిగమించేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ సీఎస్ సోమేష్‌కుమార్‌ను ఆదేశించారు. సీఎం ఆదేశాలమేరకు సీఎస్ ఎప్పటికపుడు.. పర్యవేక్షిస్తున్నా, కొనసాగుతున్న కరోనా కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ క్రమంలో సీఎం తర్వాత చర్యలపై దృష్టిపెట్టారు. ఈనెల 6 తర్వాత కరోనా కట్టడి చర్యల్లో భాగంగా ప్రస్తుతం విధిస్తున్న ఆంక్షలను మరింత పెంచవచ్చన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం నైట్ కర్ఫ్యూ రాత్రి 9 గంటల నుండి ఉదయం 5గంటల వరకు కొనసాగిస్తున్నారు. ఏపిలో మధ్యాహ్నం 12గంటల నుండి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు కర్ఫ్యూ ఆంక్షలు విధిస్తున్నారు. గత ఏడాది లాక్‌డౌన్ అనుభవాల దృష్ట్యా.. కరోనా కట్టడిపై రాష్ట్రం పలు మార్గాలను పరిశీలిస్తోంది. ఈ నెలాఖరువరకు జాగ్రత్తగా ఉంటే.. కరోనా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో కర్ఫ్యూ సమయాన్ని మరింత పెంచితే.. ఎలా ఉంటుందన్న చర్చ జరుగుతోంది. ఏపి తరహాలో.. కర్ఫ్యూ సమయం పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. కరోనా భయాలతో ప్రజారవాణా ఇప్పటికే కుదేలు కాగా, ఒక్క ఆర్టీసీలోనే వందమందికి పైగా మృతిచెందారు. సెకండ్ వేవ్ తీవ్రంగా ఉండగా, మరణాల సంఖ్య అనూహ్యంగా ఉండడం సమాజంలో కలవరాన్ని కలిగిస్తోంది. ఇతర రాష్ట్రాల అనుభవాలను, సెకండ్ వేవ్ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని కర్ఫ్యూ ఆంక్షలు పెంచే ప్రతిపాదనను సీఎం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రజల ఉపాధి అంశాన్ని దృష్టిలో పెట్టుకుని లాక్‌డౌన్ కు మొగ్గుచూపని సీఎం.. తాజా పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం కొనసాగుతున్న కర్ఫ్యూ గడువు, సమయం పొడిగించే అవకాశాలున్నట్లు తెలిసింది. తాజా ప్రతిపాదనలు, ప్రచారంపై అధినేత ఏ నిర్ణయం తీసుకుంటారోనని.. వైద్యరంగ నిపుణులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

# ఈటల ఒక మేకవన్నె పులి : మంత్రి గంగుల

హైదరాబాద్ , మే 4:ఈటల రాజేందర్ ఒక మేకవన్నె పులి. బలహీన వర్గాల ముసుగులో ఉన్న పెద్ద దొర. ఆయన హుజురాబాద్‌కు వెళ్తే బీసీ.. హైదరాబాద్‌కు వస్తే ఓసీ అని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో మంత్రి గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడారు.

అసెంబ్లీలో రాజశేఖర్ రెడ్డితో, కిరణ్ కుమార్‌రెడ్డితో తాను మాట్లాడాను అని ఈటల చెబుతున్నారు. కేవలం దేవరయాంజల్ భూముల కోసమే ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం గురించి ఆయన ఏనాడూ అసెంబ్లీలో మాట్లాడలేదు. ముదిరాజ్‌లకు చేప పిల్లలు ఇవ్వాలని ఎప్పుడైనా కేసీఆర్‌ను రాజేందర్ కోరరా? అని ప్రశ్నించారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ వారికి చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇవాళ పదవి పోగానే ముదిరాజ్‌లు గుర్తుకు వస్తున్నారు. పదవిలో ఉన్నప్పుడు ముదిరాజ్‌లను ఎందుకు దగ్గరకు తీయలేదు? అని మంత్రి గంగుల కమలాకర్ ప్రశ్నించారు.

2001లో టీఆర్ఎస్ పార్టీ స్థాపిస్తే.. ఈటల రాజేందర్ 2003లో పార్టీలో చేరారు. కేసీఆర్ ఈటలకు అన్ని రకాల పదవులు ఇచ్చారు. ఈటలను సొంత తమ్ముడిలా భావించి సీఎం కేసీఆర్ ఆదరించారు. 2018 ఎన్నికల్లో బీసీ నాయకుడిని ఓడగొట్టే ప్రయత్నం చేశాడు. అది సరికాదు. కల్యాణలక్ష్మి వద్దంటావు. ఆసరా పెన్షన్లు పరిగే అంటావు. ప్రభుత్వ పథకాలను విమర్శించారు. పార్టీలో తిరుగుబాటు తీసుకొచ్చేందుకు ఈటల ప్రయత్నించారు. అయినప్పటికీ ఆయన గౌరవానికి భంగం కలగొద్దని పార్టీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. హుజురాబాద్‌లో బీసీలను అణగతొక్కారు.

సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుకున్నానని చెప్పిన ఈటల.. ఇంత తక్కువ సమయంలో వేల ఎకరాల భూములు, వేల కోట్ల రూపాయాలు ఎలా సంపాదించాడు. మెడికల్ కాలేజీ ఎలా వచ్చింది. పార్టీ అన్ని అవకాశాలు ఇచ్చి, ప్రభుత్వంలో అన్ని రకాల పదవులు ఇచ్చినందుకే ఇవన్నీ సాధ్యమయ్యాయి. మొన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలిచిందని బాధ పడిన వ్యక్తి ఈటల



రాజేందర్ అని తెలిపారు. ప్రభుత్వంపై, సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. ఆరుసార్లు తాను గెలిచానని చెప్పడం కాదు.. కేసీఆర్ బొమ్మ మీదనే గెలిచావు. టీఆర్ఎస్ పార్టీ అన్ని ఎన్నికల్లో గెలుస్తుందంటే.. దానికి కారణం కేసీఆర్ బొమ్మ అని స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ కోట్ల ఆస్తులు ఎలా సంపాదించాడో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. హుజురాబాద్‌లో టీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందన్నారు. కేసీఆర్ ఒక లెజెండ్.. ఒక శక్తి అని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం : మంత్రులు



వరంగల్, మే 4: : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ అన్నారు. వచ్చే ఐదేండ్లలో ఈ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మీ నమ్మకాన్ని మేము నిలబెట్టుకుంటామని మంత్రులు స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం వరంగల్‌లో మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడారు.

వరంగల్ వాసులు చైతన్యవంతులు. అభివృద్ధికి ఓటేస్తారన్న నమ్మకాన్ని నిలబెట్టారన్నారు. దీనికనుగుణంగా వచ్చే ఐదేండ్లలో సుపరిపాలన అదించి మీ నమ్మకాన్ని నిలబెడుతామన్నారు. సీఎం కేసీఆర్ వరంగల్ నగరంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల నమ్మకాన్ని చూరగొన్నాయన్నారు.

టీఆర్ఎస్ తరపున గెలిని 49 మంది అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయంలో భాగస్వామ్యమైన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. వరంగల్ ఎన్నికలలో ముఖ్యమైన పాత్ర పోషించేందుకు అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మంత్రులు ధన్యవాదాలు తెలిపారు.

సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎంపీ బండ ప్రకాశ్ ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణా రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్, పెద్ది సుదర్శన్ రెడ్డి, టిఎస్ఐఐసి చైర్మన్, జిల్లా పార్టీ ఇన్ చార్జి గ్యాదరి బాలమల్లు, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న, తదితర నాయకులు పాల్గొన్నారు.

# మే18 నుంచి ఏకాంతంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి, మే4: తిరుమలతిరుపతి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మే 18 నుంచి 26వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. కోవిడ్-19 వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా ఈ ఉత్సవాలను ఆలయం లోపల ఏకాంతంగా నిర్వహించాలని టిటిడి నిర్ణయించింది. ఈ ఉత్సవాలకు మే 17వ తేదీ సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. మే 18వ తేదీ మంగళవారం ఉదయం 7.55 నుంచి 8.30 గంటల మధ్య మిథున లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

# IPL నిరవధిక వాయిదా




హైదరాబాద్ , మే 4:కరోనా సమయంలోనూ ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ఐపీఎల్ చివరికి ఆ కరోనా కారణంగానే ఆగిపోయింది. కరోనా కేసులు రోజుకు పెరుగుతుండటంతో బిసిసిఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే కొలకత్తా, చెన్నై ఆటగాళ్లు..సిబ్బంది కొందరు కరోనా బారిన పడ్డారు. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు వృద్ధిమాన్ సాహాకి కరోనా సోకింది. ఐపీఎల్ జట్లలో పలువురు ఆటగాళ్లు కరోనా బారినపడుతుండడంతో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సీజన్ కు ఐపీఎల్ ను నిలిపివేస్తున్నట్టు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించారు.

ఇప్పటివరకు తాజా సీజన్ లో 29 మ్యాచ్ లు జరగ్గా, మిగిలిన మ్యాచ్ లన్నింటినీ ముంబయిలోనే జరపాలని ప్రతిపాదనలు వస్తున్నాయి. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. కాగా, ముంబయిలో ఐపీఎల్ పోటీల రద్దు/ వాయిదా కోరుతూ దాఖలైన పిటిషన్ పై విచారణ చేపట్టేందుకు బాంబే హైకోర్టు అంగీరించింది. సెకండ్ వేవ్ కారణంగా కరోనా విజృంభణ, కరోనా కారణంగా నమోదవుతున్న మరణాలను పరిగణనలోకి తీసుకుని ఐపీఎల్ నిలిపివేతకు ఆదేశాలు ఇవ్వాలని, ఇప్పటివరకు జరిగిన నష్టానికి రూ.1000 కోట్ల పరిహారం చెల్లించేలా బీసీసీఐని ఆదేశించాలని ఆ పిటిషన్ లో కోరారు. ఐపీఎల్ లాభాల నుంచి కరోనా చికిత్సలకు, ఆక్సిజన్ కు అయ్యే మొత్తాన్ని రాబట్టాలని విజ్ఞప్తి చేశారు. అటు, ఢిల్లీ హైకోర్టులనూ ఇలాంట పిటిషనే దాఖలైంది. తక్షణమే ఐపీఎల్ పోటీలను నిలిపివేసేలా ఆదేశించాలని ఆ పిటిషన్ లో విన్నవించారు. ప్రజారోగ్యం కంటే ఇలాంటి మ్యాచ్ లకే ఎందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నదానిపై విచారణ చేపట్టాలని కోరారు.

# జిల్లాలో సభలు/ సమావేశాలు రద్దు...!!

## - జిల్లా కలెక్టర్ హనుమంతరావు.



సంగారెడ్డి, మే 4 (నేటినిజం ప్రతినిధి) కరోనా ఉధృతి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలో కరోనా నియంత్రణకు

ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. అందులో భాగంగా జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించు సభలు, సమావేశాలను రద్దు/నిలిపి వేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంగళవారంనాడు ఒక ప్రకటనలో తెలిపారు.పబ్లిక్ మీటింగ్స్/ప్రజలు గుమిగూడే గ్రామ సభలు, గ్రామ పంచాయతీ సమావేశాలు, ఎంపీపీ మీటింగ్స్, జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం, స్టాండింగ్ కమిటీ సమావేశాలు, మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు, మరియు ప్రజాభిప్రాయ సేకరణ(పబ్లిక్ హియరింగ్) తదితర సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు.

తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు సంబంధిత సమావేశాలు సభలను క్యాన్సిల్/ నిలిపి వేయాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు ఎవరూ కూడా ఎలాంటి పబ్లిక్ మీటింగ్స్ నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు.

